క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.గణపతిరావు ఆదివారం సూచించారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాలైన కల్లేపల్లి, కిల్లిపాలెం, మోపసుబందరు, పెదగనగళ్లవానిపేట, కుందువానిపేట, పొన్నాం, బట్టేరు ప్రాంతాల ప్రజలు అప్రమత్తత పాటించాలన్నారు. శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సమస్యలు తలెత్తితే 9701923554 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో శ్రావణ శోభ



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శ్రావణ శోభ కనిపించింది. ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్న క్రమంలో ఆలయ ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై ప్రత్యేక వాటర్‌ప్రూఫ్ షీట్లను ఏర్పాటు చేశారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. భువనేశ్వర్‌లో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి ఎన్.బాలకృష్ణ, కాకినాడ జిల్లా ఫైర్ ఆఫీసర్ పోలుమహంతి రాజేష్, డాక్టర్ శృతి దంపతులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెరవీధిలో ఉన్న మెహర్‌బాబా కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 39 మందికి కంటి పరీక్షలు చేసి 13 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఎల్.ఎన్.రాజు, సుధీర, కె.ఎల్.నాయుడు, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆనందోత్సవ తరగతులు



యోగా చేస్తున్న సాధకులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పెద్దపాడు వద్ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ హేపీనెస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆనందోత్సవ యోగా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కిరణ్‌కుమార్ సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేసూల సురేంద్ర, కింజరాపు అమ్మన్నాయుడు, వలంటీర్లు శ్రీనివాస రెడ్డి, సుధీర్, శ్యామలరావు, డాక్టర్ జాన్, కాత్యాయని, సాధకులు పాల్గొన్నారు.

తూర్పుకాపుల సంక్షేమానికి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనుబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపుల జాతి గౌరవాన్ని కాపాడేందుకు ప్రతీఒక్కరూ చిత్తశుద్ధిగా వ్యవహరించాలని..సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా అణగారిన కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పల్సస్ కంపెనీ సీఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు కాపు అధ్యయన వేదిక నాయకులు మాట్లాడుతూ సామాజిక భవన నిర్మాణానికి తొలి విడతగా రూ.50 లక్షలు, రెండో విడతగా రూ.25 లక్షలు ఇచ్చిన శ్రీనుబాబు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు లంక గాంధీ, ఆనెపు రామకృష్ణ నాయుడు, ఇజ్జాడ శ్రీనివాస్, లోలుగు రాజశేఖర్, పిన్నింటి భానోజీనాయుడు, శాసపు జోగినాయుడు, వాళ్ల సన్యాసినాయుడు, డోల బాలవంశీకృష్ణ, రౌతు గోపీ, ఎం.ప్రభాకర్, డాక్టర్ ఎం.రామజోగి నాయుడు, కిల్లారి నారాయణరావు, శివ్వాల శేఖర్, దన్నాన మోహనరావు, లావేటి సుందరరావు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రోడ్లతో అవస్థలు

- అడుగడుగునా గోతులే
- వర్షాలకు నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలు
- ప్రకటనలకే పరిమితమవుతున్న పాలకులు



కొయ్యాం-ధర్మవరం జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి

ఎచ్చెర్ల/జి.సిగడాం: తాము అధికారంలోకి వస్తే ఏడాది లోపే రహదారులను అద్దాల్లా మెరిపిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి నాయకులు గద్దెనెక్కాక హామీ మర్చిపోయారు. సంక్రాంతి సమయంలో కొన్నిచోట్ల హడావుడిగా రోడ్డు పనులు మొదలుపెట్టి ఆ తర్వాత అర్ధాంతరంగా వదిలేశారు. బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు సైతం రోడ్లవైపు చూడటం మానేశారు. కొన్నిచోట్ల మరమ్మతుల పేరిట ఉన్న గోతులను మరింత పెద్దగా తవ్వేసి వదిలేయడంతోవాహనచోదకులు నరకయాత అనుభవిస్తున్నారు.

బాబోయ్ కొయ్యాం రోడ్డు..

ఎచ్చెర్ల నుంచి కొయ్యాం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఎచ్చెర్ల నుంచి చిన్నరావుపల్లి, బలిజిపేట, సంతసీతారాంపురం, అజ్జరాం, కుప్పిలి, కొత్తకూర్మినాయుడుపేట, పాత కూర్మినాయుడుపేట, కొయ్యాం, బడివానిపేట, నిమ్మవానిపేట, భగీరథపురం, డి.మత్స్యలేశం, ధర్మవరం, కేడీపాలేం తదితర గ్రామాలకు ఈ దారే ఆధారం. ఈ మార్గంలో అనేక విద్యాసంస్థలు, కంపెనీలు, సంస్థలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. దీనికి తోడు వర్షపు నీరు గోతుల్లో నిలిచిపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదమరిస్తే..

జి.సిగడాం మండలంలో పాగిరి నుంచి జి.సిగడాం వెళ్లే రోడ్డు దయనీయంగా మారింది. భారీ గోతులు ఏర్పడటంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదు. ముఖ్యంగా రాత్రిపూట గమనించకపోతే గోతులో పడాల్సిందే. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాటిని గుర్తించలేక వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పనులు చేపట్టాలని ఎన్నిసార్లు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



ఎచ్చెర్ల నుంచి కొయ్యాం వెళ్లే దారిలో గోతులు



జి.సిగడాం-పాగిరి గ్రామాల మధ్య రహదారి దుస్థితి



జి.సిగడాం ఎస్సీ కాలనీ సమీపంలో ఇలా..



కేకే నాయుడుపేట వద్ద రోడ్డు దుస్థితి

మహా కుంభాభిషేక ఉత్సవాలకు వేళాయె..

- నిత్య పూజలతో అలరారుతున్న శివబాలాజీ ఆలయం
- 19 నుంచి మహోత్సవాల నిర్వహణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు



బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: శివకేశవులు ఒకే చోట కొలువై కోరిన కోర్కెలు తీర్చే స్వాములుగా పేరుగాంచిన శివబాలాజీ ఆలయం మహా కుంభాభిషేక మహోత్సవాలకు సిద్ధమైంది. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న ఈ ఆలయంలో భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, ఉమా సమేత అమరనాథేశ్వరులు ఒకేచోట కొలువుదీరడం విశేషం. ఈ ప్రాంత భక్తులు నిత్య పూజలు, సేవలతో తరిస్తున్నారు. దినదినాభివృద్ధి చెందుతూ ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది.

ఆలయ చరిత్ర..

బ్యాంకర్స్ కాలనీ వాసులు శివబాలాజీ సేవా సంఘంగా ఏర్పడి ఆలయ నిర్మాణం కోసం కృషి చేశారు. ఈ స్థలాన్ని అప్పటి కిల్లిపాలెం సర్పంచ్ ఉచితంగా అందచేయగా, భక్తులు సహకారంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయంలో వైష్ణవ, శైవ సంప్రదాయాలను కొనసాగేలా ఏర్పాటు చేసుకున్నారు. తిరుమల నుంచి వేంకటేశ్వరస్వామి, భూదేవి, జయవిజయుల విగ్రహాలను తీసుకువచ్చారు. నేపాల్ ప్రాంతం నుంచి అమరనాథుని స్ఫటిక లింగాన్ని తీసుకొచ్చారు. రెండు ఆలయాలకు వేరువేరుగా ధ్వజస్తంభాలు ఏర్పాటు చేశారు.

16 ఏళ్లు పూర్తయిన వేళ..

శివబాలాజీ ఆలయ నిర్మాణం జరిగి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏకోత్తర సహస్ర కలశ స్నపన పూర్వక మహా కుంభాభిషేక మహోత్సవాలు మూడు రోజులు నిర్వహించేందుకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు నిర్ణయించారు. 19న అగ్ని ప్రతిష్ఠ, పతాక ప్రతిష్ఠ, హోమాలు, ధ్వజారోహణం, 20న మండపారాధనలు, ఏకోత్తర సహస్ర కలశ స్నపన మండప రచన, 21న అమరాధేశ్వరునికి, వేంకటేశ్వరస్వాముల ఆలయ శిఖరాలకు మహాకుంభాభిషేకాలు, విశేష అలంకరణ, శాంతికల్యాణం, పండిత సత్కారం, అన్నప్రసాద వితరణ జరుగుతాయి.

కరపత్రాలు ఆవిష్కరణ

ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కమిటీ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్‌వీఎస్ శర్మ, కె.రమేష్ కుమార్, ముద్దాడ రామకృష్ణ, ఎస్.రాంబాబు రెడ్డి కరకవలస ప్రసాదరావు, ఆర్.వైకుంఠరావు, ఎస్.కైలాసరావు, కె.సత్యన్నారాయణ, ఎ.పట్టాభిరామారావు, కొనపాల ప్రసాదరావు, సీహెచ్.దుర్గారావు, కె.త్రినాధరావు, ఎస్.కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు గోపినంబాళ్ల వెంకట సీతారామాచార్యులు, నేతేటి మారుతీ ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

విశేషమైన ఆలయం



ఆలయం ఎంతో విశిష్టత కలిగినది. శివుడు, వేంకటేశ్వరస్వాములను ఒకేచోట ప్రతిష్ఠించి రెండు సంప్రదాయాలను కొనసాగిస్తూ ఉత్సవాలు, వేడుకలు నిర్వహిస్తున్నాం. 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహాకుంభాభిషేక ఉత్సవం మూడు రోజులు నిర్వహిస్తున్నాం.

– గుంట తులసీరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు, శివబాలాజీ ఆలయం

నిత్యకైంకర్యాలతో పూజలు



ఆలయంలో నిత్య కైంకర్యాలతో పూజలు జరుగుతున్నాయి. ఎంతో మంది భక్తులు వచ్చి దర్శనాలు చేసుకుని శుభాలు పొందుతున్నారు. అన్ని పండగలు నిర్వహిస్తున్నాం.

– గోపినంబాళ్ల వెంకట సీతారామాచార్యులు, అర్చకులు

శ్రీకృష్ణుడికి జోలపాట



జోలపాట పాడుతున్న వైష్ణవ భక్తులు

జి.సిగడాం : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా జి.సిగడాంలోని రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాత్తాద శ్రీవైష్ణవ సంఘం సభ్యులు కోవెలకొండ పార్థసారధి, కోవెలకొండ సంతోష్‌కుమార్ స్వామి, పురుషోత్తం దూర్వాసులు, హేమ నారాయణ ఆధ్వర్యంలో కృష్ణుడికి జోల పాటలు పాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దాస్యం శ్రీను, వైకుంఠరావు, ప్రవీణ్, అసూరి రమణ, కుమార్‌స్వామి, నమ్మాళ్ల శ్రీనివాసరావు, కోవెల మంగరాజు, వరుణ్ పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

శ్రీకాకుళం: అఖిల భారత చిరంజీవి యువత పిలుపు మేరకు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ రక్తనిధి సహకారంతో శ్రీ ఫంక్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో 126 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, నాగరాజు, వైశ్యరాజు మోహన్ తదితరులు పాల్గొన్నారు

బాతువ రైతులకు మద్దతుగా పోరాటం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.సిగడాం: బాతువ గ్రామ రైతులకు మద్దతుగా పోరాటాలకు సిద్ధమవుతామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బూటు అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్లు కలిశెట్టి శాంతారావు, పల్లేడ సన్యాసిరావు అన్నారు. ఆదివారం బాతువలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామ రైతులకు సకాలంలో ఎరువులు, సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతుల ఇంటి ముంగిటకే ఎరువులు, విత్తనాలు అందాయని గుర్తు చేశారు. 30 ఏళ్లుగా సహకర సొసైటీ అధ్యక్షులుగా గ్రామస్తులే వ్యవహరించేవారని, ఇప్పుడు ఆనవాయితీని విస్మరించడం తగదన్నారు. సమావేశంలో వావిలపల్లి సూర్యనారాయణ, ముల్లు సన్యాసిరావు, ముల్లు సూర్యనారాయణ, పాపినాయుడు, కలిశెట్టి వెంకటేష్, జమ్ము ఉత్తరనాయుడు, మీసాల కృష్ణారావు, ముల్లు తాతమ్మనాయుడు, అప్పలనాయుడు, మీసాల కన్నంనాయుడు, కలిశెట్టి మణికంఠ, బూటు కన్నారావు, శ్రీనివాసరావు, మోహనరావు, రెడ్డి కోదండరావు పాల్గొన్నారు.

వైభవంగా.. మహా పుష్పాభిషేకం



కోష్ట సమీపంలోని రాధాగోవింద మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాగోవిందులకు మహా పుష్పాభిషేకం చేసి అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- రణస్థలం

నగర కళింగ కోమటి సంఘ అధ్యక్షుడిగా కోరాడ హరిగోపాల్



కోరాడ హరిగోపాల్

శ్రీకాకుళం : నగర కళింగ కోమటి సంఘ అధ్యక్షుడిగా కోరాడ హరిగోపాల్ ఎంపికయ్యారు. గత 15 రోజులుగా అధ్యక్ష ఎంపికపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పదవి కోసం పలువురు పోటీ పడగా చివరికి కోరాడ హరిగోపాల్, ఊణ్న సర్వేశ్వరరావు, కోరాడ రమేష్ మధ్య పోటీ ఏర్పడింది. ఆదివారం కళింగ వైశ్య సంఘం సమావేశం నిర్వహించగా రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులు హాజరయ్యారు. ఆశావాహులంతా తమకే పదవి కావాలని పట్టుబట్టారు. కాగా, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు వీరి ముగ్గురితో ప్రత్యేకంగా సమావేశమై రాజీకుదర్చడంతో హరిగోపాల్‌ను నగర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సర్వేశ్వరరావు, రమేష్‌లకు సముచిత స్థానం కల్పిస్తామని హామీఇచ్చారు. హరిగోపాల్ ప్రస్తుతం వర్తక సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సంఘానికి ఇప్పటివరకు మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు.

ఊరటనిచ్చిన వాన



గరికిపాలెంలో ఇంటి చుట్టూ చేరిన నీరు

రణస్థలం: మూడు వారాలుగా మండుటెండలతో అవస్థలు పడిన ప్రజలకు వరుణుడు ఊరటనిచ్చాడు. శనివారం అర్ధరాత్రి నుంచి మొదలైన వర్షం ఆదివారం కూడా కురుస్తునే ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రణస్థలం, జీరుపాలెం, సంచాం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.

యోగా పోటీల్లో రిఫరీగా వర్సిటీ అధ్యాపకుడు

ఎచ్చెర్ల : కాకినాడ సీబీఎస్ఎస్‌సీ స్కూల్లో జరిగిన సౌత్ జోన్-1 యోగా పోటీల్లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్శిటీ యోగా, ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకుడు కె.వి.ఎస్.మూర్తి రిఫరీగా వ్యవహరించారు. ఈ నెల 15న ప్రారంభమైన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడుకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రిఫరీగా విజయవంతంగా సేవలు అందించినందుకు ముగింపు రోజున నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మూర్తిని వర్సిటీ వీసీ కె.ఆర్ రజినీ, సిబ్బంది అభినందించారు.

ఫలితమివ్వని పూడిక తీత

- జలమయమవుతున్న నగరవీధులు
- కొద్దిపాటి వర్షం వచ్చినా రోడ్లపైనే నిలిచిపోతున్న నీరు
- ఇబ్బందుల్లో నగరవాసులు



భారత్ ఐటీఐ కాలేజీ ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వర్షాలు పడితే నదీపరివాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించడం సర్వసాధారణం. అయితే జిల్లా కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం. చిన్నపాటి వర్షం వచ్చినా శ్రీకాకుళం నగరవీధులు జలమయం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలుమార్లు కాలువల్లో పూడికల తీత పేరుతో పనులు నిర్వహిస్తున్నా ఏమాత్రం ఉపయోగపడటం లేదని, అందుకు ప్రస్తుతం వర్షాలు సమయంలో కనిపిస్తున్న వీధులే సాక్ష్యంగా నిలుస్తున్నాయని నగరవాసులు చెబుతున్నారు. కాలువల్లో పూడికలు కొంచెం కొంచెం తీసి లక్షలాది రూపాయలు బిల్లులు తీసుకోవడం తప్ప ఒరిగిందేమీ ఉండటం లేదని అంటున్నారు. కాలువల్లో పూడికలు తీసేందుకు కనీసం టెండర్లు కూడా పిలవకుండానే పనులు సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా వరకు 'సీ' బిల్లులు చెక్ పేమెంట్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. పూడికలు తీసే పనుల్ని కనీసం పరిశీలించే అధికారులే లేరు. ఎవరికి ఎలా నచ్చితే అలా పనులు చేయించి కార్పొరేషన్‌లో పనిచేసే కొందరు అధికారులు కలిపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రభాకర్‌నగర్‌కాలనీలో రోడ్డుపైనే వర్షం నీరు



హడ్కోకాలనీలో చెరువును తలపిస్తున్న వీధులు

ఎక్కడ చూసినా నీరే..

ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్, అటవీ శాఖ కార్యాలయం రోడ్డు, ఇలిసిపురం జంక్షన్, కళింగ రోడ్డు, కిన్నెర థియేటర్ రోడ్డు, గుజరాతిపేట రోడ్డు, తోటపాలెం రోడ్డు, కృష్ణా పార్కు, సరస్వతి మహాల్ రోడ్డు, హడ్కోకాలనీ, భారతీనగర్, ప్రభాకర్‌నగర్ కాలనీ, డీసీసీబీ కాలనీ, తిలక్‌నగర్, ఏఎస్ఎన్ కాలనీ, విశాఖ-ఏ, బీ కాలనీలు, జామితోట, బ్యాంకర్స్‌కాలనీ, భైరవానిపేట, సీపన్నాయుడుపేట తదితర ప్రాంతాలు నీటమునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..

నగరంలో చిన్న వర్షం పడినా రోడ్లు, కాలనీలు నీటమునిగిపోతున్నాయి. ఏ కాలువ ఎక్కడ ఉందో, ఎక్కడ గోతులున్నాయో తెలియడం లేదు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నాం. కాలువల్లో పైపైన పూడికలు తీసేసి వదిలేస్తున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– ఎం.నరేష్, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం..

నగరంలో పలు ప్రాంతాలు జలమయం కావడం వాస్తవమే. అయినా ఎప్పటికప్పుడు పూడికలు తీయిస్తున్నాం. దీనికి శాశ్వత పరిష్కారం అండర్ డ్రైనేజీ ఒక్కటే మార్గం. అయితే ఇది భారీ వ్యయంతో కూడుకున్నది. లోతట్టు ప్రాంతాల్లో నీటిని తగ్గించేందుకు ఆయిల్ ఇంజిన్లు పెడుతున్నాం.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం